# నిర్ణయం

కస్తూరి నయనతార




''అయ్యో! టిఫిన్ బాక్స్ ఇక్కడే మర్చిపోయారు. తీసుకుని బేగ్‌లో పెట్టుకోండి. మర్చిపోయి ఆఫీస్‌కి వెళ్లిపోతారు. నేను పొద్దున్నే లేచి పడ్డ శ్రమంతా వృథా అవుతుంది. మీకు తినడానికి ఏమీ ఉండదు అక్కడ. సాయంకాలం ఉసూరుమంటూ వస్తారు'' అంటూ టిఫిన్‌బాక్స్‌ని డైనింగ్ టేబుల్ మీదే వదిలేసి, ఆఫీసుకి వెళ్లిపోబోతున్న భర్తకు గుర్తుచేసింది సావిత్రమ్మ.

''అబ్బా, నాకు లేటయిపోతోంది. కాస్త పెట్టచ్చుగా నువ్వే అలా అరవకపోతే?'' ఆఫీసుకి టైమైపోతోందనే కంగారులో భార్యని విసుక్కున్నాడు గోపాల్రావు.

''కాస్త తొందరగా తయారవ్వచ్చుగా, గంటలు గంటలు పేపర్ చదువుకుంటూ కూర్చోకపోతే? అంతసేపు పేపర్ చదివి, దేశాన్నేమైనా ఉద్ధరించాలా ఏమిటి ఇప్పుడు మీరు?'' రెట్టించింది సావిత్రమ్మ. రేపోమాపో రిటైర్ కాబోతున్న భర్త గోపాల్రావుని.

''సరే...సరే... ఇటు పడేయ్! సాయంకాలం వచ్చాక తీరిగ్గా వాదించుకుందాం'' అంటూ టిఫిన్ బాక్స్ తీసుకుని ఆఫీసుకి బయలుదేరాడు.

గోపాల్రావు త్వరలోనే రిటైర్ కాబోతున్న ఒక సామాన్య ఉద్యోగి. హైద్రాబాద్ నగరంలో అతని ఆఫీసు ఇంటికి కొంచెం దూరమే కావడంతో భారతంలోని పద్మవ్యూహాన్ని మించిన ట్రాఫిక్ మధ్య ఆయన తన స్కూటర్ మీద రోజూ వెళ్లి వెళ్లి ఎప్పుడెప్పుడు రిటైర్ అయి, ఇంట్లో కూర్చుందామా అని ఎదురుచూస్తున్నాడు. ఆయన చాలా నిదానస్థుడు.

సంవత్సరాల తరబడి, పొద్దుటే లేచి, హడావిడిగా రెడీ అయి, న్యూస్‌పేపర్ హెడ్‌లైన్స్ మించి చదవడానికి సమయం సరిపోని మధ్యతరగతి వ్యక్తి. గోపాల్రావుకి నిద్రలేచిన తర్వాత, తన స్నేహితులతో కలిసి పక్కనున్న పార్క్‌కి వెళ్లి, మార్నింగ్ వాక్ చేసుకుంటూ వాళ్లతో ప్రాంతీయ రాజకీయాల దగ్గర నుండి అంతర్జాతీయ విషయాల వరకు అన్నిటి గురించి మాట్లాడుకోవాలని ఆయనకు తీర్చుకోలేని కోరిక. ఆయనకిలా తీర్చుకోలేని సరదాలు చాలానే ఉన్నాయి.... బాల్కనీలో కూర్చుని, భార్యతో కబుర్లాడుకుంటూ, ఒక కప్పు కాఫీ అరగంటసేపు తాగుతూ ఎంజాయ్ చేయడం, న్యూస్‌పేపర్ మొదటి లైను నుండి చివర లైన్ దాకా క్షుణ్ణంగా చదవడం, భార్య చేత తలకి నూనె రాయించుకుని, తీరికగా స్నానం చేయడం, ఒక పది నిమిషాలు పూజగదిలో ప్రశాంతం కూర్చోవడం, ప్లాస్టిక్ డబ్బాల్లో కాకుండా తన వెండి కంచంలో షడ్రసోపేతమైన తన భార్య చేతి వంట, భార్యతో కూర్చుని తీరికగా ఆస్వాదించడం, తమ ఉయ్యాల బల్ల మీద కూర్చుని భార్య చిలకలు చుట్టి అందిస్తుంటే, తాంబూలం సేవించడం, మధ్యాహ్నం కొంచెంసేపు కునుకు తీయడం, భార్యతో కలిసి, సాయంకాలాలు మందిరానికో సినిమాకో వెళ్లడం.... ఇలా.. ఇలా ఒక పెద్ద లిస్టే తయారవుతుంది. ప్రస్తుతానికి వీటిల్లో ఏ ఒక్కటీ తీర్చుకోలేక, అన్నిటినీ రిటైర్ అయ్యాక తీర్చుకోవచ్చని, ఆ రోజుకే ఎదురుచూస్తున్నారు.

ఇక సావిత్రమ్మగారి పరిస్థితి కూడా ఇంచుమించుగా అలాగే ఉంది. పెళ్లైన దగ్గర నుండి తన సరదాలు, హాబీలు మర్చిపోయి, ఇంటి పనులకే అంకితమైపోయింది. అత్తమామలకి కోడలు తనొక్కర్తే అవడంతో, అత్తింటి బాధ్యతలన్నీ ఆవిడ మీదే పడ్డాయి. ఆడపడుచుల పెళ్లిళ్లు, పురుళ్లు... ఒకదాని తర్వాత ఒకటి మెల్లిగా అన్ని బాధ్యతలు తీర్చుకుంది. ఇప్పుడు అత్తగారు స్వర్గస్థురాలైన తర్వాత మంచం పట్టిన తొంబయ్యో పడిలో పడబోతున్న మామగారికి అన్నీ చూసుకుంటోంది.

గోపాల్రావు, సావిత్రమ్మలకి ఇద్దరు పిల్లలు. ఇద్దరూ కొడుకులే. ఆడపిల్లలు లేకపోవడంతో సావిత్రమ్మకి ఇంటి పనులలో సాయం చేసే చేయి లేదు. అన్ని బాధ్యతలతో పాటు, పిల్లలిద్దర్నీ కష్టపడి చదివించి, ఈనాడు మంచి ఉద్యోగస్తులవ్వడానికి భర్తకు అన్ని విధాల తోడ్పడింది. ఇప్పుడిక వారికి పెళ్లిళ్లు చేస్తే రాబోయే కోడళ్లు తనకి కాస్త విశ్రాంతి కల్పిస్తారని ఆశతో ఎదురుచూస్తోంది. వాళ్ల పెళ్లిళ్ల కోసం, పక్కింటి పంకజం, ఎదురింటి కమలమ్మ తమ కోడళ్లు ఇళ్లు చూసుకుంటుంటే, వీళ్లు గుళ్లూ గోపురాలకి తిరుగుతూ వాళ్లకే మంచి కోడళ్లున్నట్లు ఫోజులు కొడుతుంటే సావిత్రమ్మలో ఈమధ్య కొంచెం ఈర్ష్య కూడా చోటు చేసుకుంటోంది. ఆ ఈర్ష్యే భర్త మీద చిరాకుగా మారుతూ ఉంటుంది అప్పుడప్పుడు. మరుక్షణమే భర్త మీద జాలిపడుతూ ఉంటుంది.

''పాపం ఆయన మాత్రం ఏం బావుకుంటున్నారు? ఆ పాత స్కూటర్ మీద ఈ మాయదారి ట్రాఫిక్‌లో అంత దూరం పడీపడీ పోతారు. సాయంకాలాలు చీకటి పడ్డాక అలసిపోయి వస్తారు. ఇక నన్ను పట్టించుకోటానికి ఆయనకి టైమ్, ఓపిక ఎక్కడిది?'' అనుకుంటూ సరిగ్గా ఈ రోజు కూడా అదే జరిగింది.

'పాపం, పొద్దున్న ఊరికే విసుక్కున్నాను ఆయన మీద. ఆయనకీ వయసు మీద పడుతోంది. అంత దూరం స్కూటరులో పడిపోతారు పాపం, రాత్రికి ఆయనకి మంచి భోజనం పెట్టాలి. పెసరపచ్చడి, ఉల్లిపాయ పులుసు చేస్తాను. ఆ కాంబినేషన్ ఆయనకి చాలా ఇష్టం. సాయంత్రం టీతో పాటు పకోడీలు చేసి పెడతాను' అని ప్లాన్ చేసుకుంది.

అక్కడ గోపాల్రావుగారు కూడా భార్య గురించే ఆలోచిస్తున్నారు. ''పాపం, ఒంటి చేత్తో ఇన్నేళ్ల బట్టి అందరినీ సంభాళిస్తోంది. ఎంత కాలం చేయగలదు తను మాత్రం? కోడలు వస్తేనే కానీ, దానికి కొంచెమైనా రెస్ట్ ఉండదు. ఇంటికి వెళ్లేటప్పుడు వేడివేడి జిలేబీ తీసుకుని వెళ్తాను. ఢిల్లీ స్వీట్ భండార్ నుండి పాపం, వెర్రిబాగులది, ఇష్టంగా తింటుంది'' అనుకున్నారు.

సాయంకాలం టీతోపాటు సావిత్రమ్మ చేసిన పకోడీలు గోపాల్రావు తెచ్చిన జిలేబీ తీసుకుంటూ భార్యా భర్తలిద్దరూ కబుర్లాడుకుంటున్నారు.

''ఈరోజు కూడా ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కున్నారా?'' ఆప్యాయంగా అడిగింది భర్తను సావిత్రమ్మ.

''ఇరుక్కోక ఏం చేస్తానే బాబూ? ఎంత హెవీ ట్రాఫిక్ అనుకున్నావు? ఇంటికెలా చేరానో నాకే తెలియదు!''

''అలాగా, పాపం! మీరు రిటైర్ అయ్యేదాకా మీకీ బాధ తప్పదు.''

''అయినా ఇక ఏ ఊరూ లేనట్టు అందరూ హైద్రాబాద్ వచ్చి పడిపోతున్నట్లున్నారు. ఆఫీసు

నుండి వచ్చేటప్పుడైతే పరిస్థితి మరీ ఘోరం అంటే నమ్ము''

''ఇంకో ఆర్నెలలు మీకీ కష్టాలు తప్పవు. ఇంకో ఆర్నెళ్లల్లో రిటైర్ కాబోతున్నారుగా! అప్పుడిక ఇంటి పట్టునే ఉందురుగానీ కాస్త విశ్రాంతిగా.'' సావిత్రమ్మ సానుభూతి చూపించింది భర్త మీద.




''ఆర్నెల్లు ఇట్టే గడిచిపోతాయి లేవే! ఈలోపు పెద్దాడికి పెళ్లి చేసేస్తే కోడలు వచ్చి నిన్ను కూడా రిలీవ్ చేస్తుందిలే. అప్పుడు మనిద్దరికీ కాస్త ఆటవిడుపు'' మురిపెంగా భార్య ముఖంలోకి చూస్తూ అన్నాడు గోపాల్రావు.

''అవునండీ, నేను కూడా ఆ శుభఘడియ కోసమే ఎదురుచూస్తున్నా. అప్పుడు ఆ పంకజం, కమలమ్మ ముందు నేను కూడా కాస్త తలెత్తి తిర్గగలను. వాళ్లకీమధ్య మరీ మిడిసిపాటు పెరిగిపోతోంది'' వంతపాడింది సావిత్రమ్మ కాస్త ఉడుకుమోత్తనం జోడించి.

★ ★ ★

సావిత్రమ్మ, గోపాల్రావులు ఎదురుచూసిన ఘడియ రానే వచ్చింది. పెద్దకొడుకు రమేష్‌కి పెళ్లి జరిగింది. కోడలు నీరజ చక్కనైనదే కాక చదువుకున్న పిల్ల కూడా. కొత్తకోడలిని చూసి తెగ మురిసిపోతోంది సావిత్రమ్మ. గోపాల్రావుగారి సంగతైతే ఇక చెప్పనక్కర్లేదు. ఆయన ఆనందానికి అవధుల్లేవు. వియ్యంకుడు అవటంతో పాటు ఉద్యోగం నుండి విముక్తి లభించబోతోంది వచ్చేవారం నుండి.

''ఏమండోయ్, సావిత్రమ్మగారూ! ఇక అత్తగారి హోదా వెలగబెట్టండి. కుర్చీలో కాలు మీద కాలేసుకుని కూర్చుని ఆర్డర్స్ పడేయండి..'' ఆట పట్టిస్తున్నాడు గోపాల్రావు భార్యని ఒక రోజు.

''అబ్బ... చాల్లెండి... మీ సంబరం!'' అంది సావిత్రమ్మ సిగ్గు, సంతోషం మేళవించి.

''అవునే, సావిత్రీ! మనం వచ్చే ఆదివారమే నువ్వెప్పటి నుండో అడుగుతున్న రామేశ్వరం వెళ్లబోతున్నాం. ఇక పెళ్లి హడావిడి కూడా తగ్గినట్టే కదా?'' చెప్పాడు గోపాల్రావు ఆనందంగా.

''అవునా? నిజంగానా? లేక వేళాకోళమా?'' అనుమానంగా అడిగింది సావిత్రమ్మ.



''నిజంగా నేనే! గిల్లమంటావా? అబ్బాయి, కోడలు హనీమూన్‌కి వెళ్తే మనం మన యాత్రలకి వెళ్తాం. నాన్న దగ్గర నాలుగు రోజులు మా చెల్లెలు విశాల ఉంటానంది. అబ్ ఆప్ ఖుష్ హో?'' అని ఖుషీఖుషీగా గోపాల్రావు భార్యని అడుగుతుండగా ''హాయ్ నాన్నా! మీకో గుడ్‌న్యూస్ చెప్పాలి!'' అంటూ వచ్చాడు ఆనందంగా పెద్దకొడుకు రమేష్.

''రారా, రా! కొత్త పెళ్లికొడుకువిగా! నీకన్నీ గుడ్ న్యూస్‌లానే కనిపిస్తాయి. ఇంతకీ మీ హనీమూన్ ప్రయాణం ఎప్పుడు? ఎక్కడికి?'' కొడుకుని అడిగాడు గోపాల్రావు ఉషారుగా.

''నాకు లీవు లేదా నాన్నా! ఇప్పుడె

క్కడికీ వెళ్లలేం. తర్వాత చూస్తాం. ముందు నన్ను గుడ్‌న్యూస్ చెప్పనివ్వండి. విన్నారంటే ఎగిరి గంతేస్తారు నాన్నా మీరు, అమ్మా నువ్వు కూడా. అర్జెంట్‌గా నాన్నని నీకో మంచి గిఫ్ట్ ఇవ్వమని అడుగు.'' అన్నాడు పక్కనే ఉన్న అమ్మతో.

''అబ్బ, మీరుండండీ కాస్త!'' అని భర్తని ఆపి,

''చెప్పరా, నాన్నా నువ్వు చెప్పు.'' తొందర చేసింది సావిత్రమ్మ కొడుకుని.

''నాన్నా! మా ఫ్రెండ్ వాళ్ల కంపెనీలో మీకో మంచి జాబ్ ఆఫర్ వచ్చింది. మీరు నెక్స్ట్ వీక్ రిటైర్ అయిపోతున్నారు కదా? వాడికి చెప్తే వాడీ సంగతి చెప్పాడు నాన్నా. బోరింగ్ రిటైర్డ్ లైఫ్ లేకుండా వెంటనే మీకో మంచి జాబ్ ఆఫర్. రేపు ఫస్ట్‌నే జాయిన్ అవ్వాలిట....'' చెప్పాడు ఆనందంగా.

గోపాలావు, సావిత్రమ్మలు ఊహించని ఈ పరిణామానికి నోట మాట రాక తెల్లమొహాలు వేసుకుని ఒకరినొకరు చూసుకుంటుండగా....

''నాన్నా! మీరేమీ ఆలోచించకండి. మంచి శాలరీ. మనకి హౌసింగ్‌లోన్ అవీ తీర్చడానికి చాలా హెల్ప్‌ఫుల్‌గా ఉంటుంది. అయినా మీరు మాత్రం ఇంట్లో ఊరికే కూర్చుని ఏం చేస్తారు? మీకు మంచి టైమ్ పాస్. మళ్లీ డబ్బుకి డబ్బు. డబ్బు ఎవరికి మాత్రం చేదు చెప్పండి నాన్నా?'' అంటూ తల్లిదండ్రుల హావభావాలు ఏమాత్రం గమనించకుండా చెప్పుకుపోతున్నాడు.

సావిత్రమ్మ చెవులకు కొడుకు చెప్పుకుపోతున్నది ఏమీ వినిపించట్లేదు. మళ్లీ హడావిడిగా రెడీ అయి, టిఫిన్ బాక్స్ తీసుకుని, తన పాత స్కూటర్ తీసి, ఉసూరుమంటూ స్టార్ట్ చేస్తున్న భర్త కనిపిస్తున్నాడు.

''ఏమంటారు నాన్నా? మీరు రిటైర్ అయ్యాక ఫస్ట్ నుండి కొత్త జాబ్‌లో జాయిన్ అవ్వాలి... ఓ.కె.? నీరజక్కూడా ఫస్ట్‌న జాయిన అవమని మెయిల్ పంపారు. అందుకని మేమిప్పుడు హనీమూన్‌కి వెళ్లడం లేదు. తర్వాత వీలు చూసుకుని వెళ్లచ్చు. తను కూడా నాతో పాటు ఎనిమిది గంటల కల్లా లంచ్ బాక్స్ తీసుకుని వచ్చేస్తుంది. నేను డ్రాప్ చేసేస్తాను. మీరు మీ స్కూటర్ మీద వెళ్లిపోదురు గానీ. సరేనా నాన్నా? నేను కొంచెం ఫ్రెష్ అయి వస్తాను'' అని తన రూమ్‌లోకి వెళ్లిపోయాడు.

అయోమయంగా దిక్కులు చూస్తున్న భార్యకేసి చూశాడు గోపాలావు. ఆయనకు భర్త, పిల్లల బాక్స్‌లతో పాటు కోడలి బాక్స్ కూడా సర్దుకుంటూ కనిపించింది.

''అయితే ఇద్దరం బాక్ టు స్క్వేర్ ఒన్ అన్నమాట!'' అనుకుంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు గోపాలావు.

ఇంతలోనే ఎవరో చాచి లెంపకాయ కొట్టినట్లై ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాడు. కొట్టింది ఎవరా అని ఆలోచించగా తన పెళ్లి జరిపించిన బ్రాహ్మణుడి మొహం గోచరించింది.

''నా చేత చెప్పించుకుని, నువ్వు చేసిన పెళ్లినాటి ప్రమాణాల మాటేమిటి? నువ్వు తాళి కట్టిన నీ భార్య అలా తన జీవితాంతం ఎవరో ఒకరికి సేవ చేస్తూ గడపాల్సిందేనా? ఆమె జీవితంలో మార్పేమీ ఉండదా? నువ్వు ఏమీ చేయలేవా? వట్టి ప్రేక్షకుడిగా మాత్రమే మిగిలిపోతావా?'' అని చీవాట్లు పెడుతూ నిలదీసినట్లనిపించింది.

''కాదు... కాదు.. నా భార్యనలా గాలికి వదిలేయలేను. పెళ్లినాడు అన్నీ తానై బాధ్యతలను స్వీకరిస్తానని ప్రమాణం చేశాను. అర్థం తెలియని సంస్కృత శ్లోకాలలో చెప్పినా వాటి అర్థం అదేగా. అప్పుడు తల్లిదండ్రుల, అక్కచెల్లెళ్ల బాధ్యతలతో కట్టిపడేశాను. ఇప్పుడు మళ్లీ పిల్లల, మనవల బాధ్యతలతో మళ్లీ మొదటికి తేలేను... తేకూడదు. ఐ షుడ్ డు సమ్‌థింగ్. ఇక ఈ వయసులో తను, తన భార్య తమకిష్టమైన రీతిలో తమ జీవితాలను తాము జీవించే స్వతంత్రాన్ని కోల్పోలేము. అబ్బాయి జీవితం అబ్బాయి చూసుకోవల్సిందే. ఎప్పుడైనా తప్పనిసరి పరిస్థితుల్లో తమ ఆసరా తప్పక వాళ్లకుంటుంది. అంతేకానీ వాళ్లు పూర్తిగా తమ మీద ఆధారపడకూడదు. నేను ఇక ఏ ఉద్యోగంలోనూ చేరబోయేది లేదు. నా భార్య కూడా ఇక వంటింట్లో ఫుల్‌టైమ్ జాబ్ చేయబోదు'' అని నిర్ధారించుకుని,

''ఏవోయ్ సావిత్రీ! మొహం అలా పెట్టావేమిటీ? ఏమిటి నీ ఆలోచన? ఇక నీ సందేహాలన్నిటికీ ఫుల్ స్టాప్ పెట్టు. నాకు మళ్లీ ఏ జాబ్‌లోనూ చేరే ఉద్దేశ్యం లేదు. రిటైర్ అయిన వాళ్లు మళ్లీ ఉద్యోగాల్లో జేరుతూ, చిన్న వాళ్లకి ఉద్యోగావకాశాలు తగ్గించేయకూడదు. మనం అనుకున్నట్లుగా రామేశ్వరం వెళ్తున్నాం. నువ్వింక ఏమీ ఆలోచించనవసరం లేదు. అబ్బాయితో నేను మాట్లాడతాను. నా నిర్ణయమిక మారదు. ఇప్పుడు మనమిద్దరం ఫ్రీ బర్డ్స్. ఐ విల్ టేక్ కేర్ ఆఫ్ యూ! డోన్ట్ వర్రీ!'' అంటూ సావిత్రమ్మకి కొత్త ప్రపంచం చూపించారు గోపాలావుగారు. సావిత్రమ్మ భర్త స్థిర నిర్ణయం విని, నవ్వుకుంటూ భర్తకేసి గర్వంగా చూసుకుంది.

○



## గొప్పే మరి!

నాకు బోల్డన్ని ఆఫర్లు వస్తూనే వున్నాయి. కానీ పాత్రల ఎంపికలో ఎంతో జాగ్రత్తగా వుంటూ లిమిటెడ్‌గానే సినిమాలు అంగీకరిస్తున్నాను- ఎందుకంటే నాకిప్పుడున్న గుర్తింపును పదికాలాలపాటు నిలుపుకోవాలంటే క్వాంటిటీ కంటే క్వాలిటీ ముఖ్యం కదా- అంటుంది కాజల్ అగర్వాల్. తనేమీ గొప్ప తారని కాదని, తనకంటే బాగా టాలెంట్ వున్న వాళ్లు ఎంతోమంది అవకాశాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారనీ, తను ఒప్పుకోలేని సినిమాలు అలాంటి వారిని వరిస్తే తనకి ఎంతో ఆనందంగా వుంటుంది అని తన విశాలభావాలను చాటుకుంటోంది కాజల్.